# గీత దాటని చైతన్యం



లీలా!

ఈ ఉత్తరంలోని ప్రతి అక్షరం నిన్ను బాధ పెట్టడమే గాక, నీ హృదయాన్ని తీవ్రంగా గాయపరుస్తుందనీ తెలుసు. అయినా వ్రాస్తున్నానంటే గాయపరచాలనే ఉద్దేశ్యం మాత్రం కాదు. మనం అనాలోచితంగా చేసే కొన్ని పనులు అవతల వ్యక్తి జీవితంతో ఆడుకుంటున్నప్పుడు, ఆ వ్యక్తి అనుభవించే మానసిక క్షోభను అద్దం పట్టడమే ఈ నా చిన్న ప్రయత్నం. ఉత్తరం మరొక్కసారి చదువుకుని పోస్ట్ చేశాడు శ్రీధర్.

పోస్ట్! కేక వినిపించి పరుగెత్తు కొచ్చి ఉత్తరం అందుకుంది లీల. కానీ, విప్పడానికి భయం వేసింది. అందుకు కారణం శ్రీధర్ చేతి వ్రాతను గుర్తు పట్టడమే... తనను ఎవరూ చూడడం లేదు కదాని మొత్తం పరికించి చూసింది. ఎవరూ చూడలేదనే నిర్ణయానికి వచ్చేలోపే ఆ ఉత్తరం ఆమె ఎద పొంగులను అంటిపెట్టుకుని వున్న జాకెట్ మడతల్లోకి వెళ్ళిపోయింది.

తన యవ్వన ప్రాయంలో పూసిన తొలి ఆశా పుష్పం శ్రీధర్. కానీ ఆ పుష్పం కేవలం కోరిక తీర్చుకోవడానికి మాత్రమేగాక, ఒక జీవితానికి సరిపడగల ఆరాధనకు తను ఉపయోగించుకోవా లనుకున్న 'పూజా పుష్పం'. అప్రయత్నంగానే చేయి ఉత్తరాన్ని చింపుతుంటే, కన్నీళ్ళు హృదయాన్ని పరామర్శిస్తున్నాయి.

లీలా! ఈ ఉత్తరం వ్రాయడానికి నీ అడ్రస్ నాకెలా తెలిసిందా అని ఆశ్చర్యపోతున్నావు కదూ! శివుడు 'భక్తకన్నప్ప'ను పరీక్షిస్తూ— నీ రెండు కళ్ళూ నాకిచ్చేశావు కదా! ఇంకెలా చూడగలవు అని ప్రశ్నించినప్పుడు... కన్నప్ప నవ్వుతూ తన 'మనోనేత్రం' వైపు చూపాడు. అయినా ఇన్నేళ్ళ మన పరిచయంలో నేను నీ పట్ల ఏ విధమైన అసభ్యంగాను, అగౌరవంగానూ నడచుకో లేదు. "నుదుటున ఒక ముద్దైనా అద్దకుండా స్వచ్ఛతను ఆపాదించుకుంది మన స్నేహం".

పవిత్రమైన ప్రేమ శారీరక వాంఛకు అతీతమైన దని మీకు తెలియజేయడానికి నాకు రెండు సంవత్సరాల వ్యవధి పట్టింది. మన పరిచయం స్నేహంగా, ఆ స్నేహం ప్రేమగా మారుతున్న సమయంలో నువ్వొక్క మాటన్నావు గుర్తుందా...?

సెక్స్ పార్టిసిపేషన్‌కు పెళ్ళి అవసరమా? అని... అది పార్టిసిపేట్ కావాలనుకుంటున్న జంటలోని చైతన్యాన్ని బట్టి వుంటుంది అన్నాను. నవ్వుతూ నా వైపు చూసి— 'నిన్నొకటి అడగనా?' అన్నావు.

యండమూరి వీరేంద్రనాథ్‌లా "ఆ ఒక్కటి అడక్కు" అని నేనెలా అనగలను.

ఓ.కె. అన్నాను.

'నీతో నాకు సెక్స్ పార్టిసిపేషన్ కావాలి' అని అడిగావు, నా పిచ్చికి జాలేసింది. ఇలా సిగ్గువిడచి అడుగుతున్నందుకు క్షమించమని— కంట తడి పెట్టుకున్నావు. నీ యవ్వనం నిన్ను కాటేస్తున్నప్పుడు, నీ వయసు అడిగిన ప్రశ్న అది... అని నీకు తెలియ జెప్పేందుకు నాలో నేను ఎంత కుమిలిపోయానో నీకు తెలుసా...? ఆ తరువాత ఒక రోజు...?

"శ్రీధర్! నా తొందరపాటు చర్యను క్షమించు, నిన్ను నేను సిగ్గువిడచి సెక్స్ పార్టిసిపేషన్ కావాలని కోరినప్పుడు కూడా, నాలోని లేకి తనాన్ని బట్టబయలు చేశావు" అన్నావు.

నాకు పెళ్ళి నిశ్చయమైందని చెప్పావు. సంతోషంగా తల నిమిరి— 'విష్ యూ ఆల్ ది బెస్ట్' అని చెప్పాను. ఆ సమయంలో నా ఈ చిన్ని హృదయం, ఎన్ని ముక్కలయ్యాయో నాకు మాత్రమే తెలుసు. అయినా చలించలేదు. అప్పుడు కూడా నీ శ్రేయస్సు తప్ప మరేమీ ఆశించలేదు. ఒక్కపూట కూడా నీ కడుపు నింపగల అర్హత నాకు లేనప్పుడు, నిన్ను పొందాలని ఆశించడం మహానేరమౌతుంది. అందుకే ఆనాడు నా మౌనం నీకు సమాధానమైంది.

శ్రీధర్! నువ్వు నా కోరికను ఆసరాగా తీసుకుని నా శరీరాన్ని కోరుకుని వుంటే, నా బ్రతుకు 'కుక్కలు చింపిన విస్తరి' అయివుండేది కదా! అన్నావు.

ఆ విషయాన్ని అప్పుడు చాలా తేలికగా తీసుకుని, చిన్నగా నవ్వి, నీలోని 'చైతన్యం' స్థాయి ఆ గీత దాటి రాలేదు కనుక, అదే జరిగి వుండేదేమో! అన్నాను.

'అర్థం కాలేదన్నావు నవ్వు'.

పవిత్రమైన మన స్నేహాన్ని కూడా నీ భర్త అనుమానిస్తాడేమోనని ముందు జాగ్రత్త చర్యగా నీ అడ్రస్ కూడా నాకు తెలుపకుండా, కనీసం నీ పెళ్ళికి కూడా నన్ను ఆహ్వానించకుండా, పెళ్ళి చేసుకుని అత్తవారింటికి వెళ్ళిపోయావు.

సెక్స్ పార్టిసిపేషన్‌కు పెళ్ళి అవసరం అనుకునే దానివి, తెగించి నాతో సెక్స్ పార్టిసిపేషన్ కావాలని కోరుకున్నందుకు జోహార్లు. అప్పుడు నీది ఎదగని మనసు. ఇప్పుడు ఎదిగిన మనసుతో ఆలోచించు. ఒకప్పుడు నీవు నా నుండి కోరుకున్నది ఇప్పుడు నీకు భర్త అందిస్తూనే వుంటాడు అనుకుంటున్నాను. కానీ, ఇన్నాళ్ళ మన స్నేహంలో నేను ఏ తప్పు చేశానని నాకీ శిక్ష విధించావు.

ఒక వీక్లీలో 'మ్యారేజ్ డే' శీర్షికలో మీ దంపతుల ఫోటో చూశాను. మొదట ఆశ్చర్య పోయాను. ఆ తరువాత తెలిసింది. నీ భర్త ఐశ్వర్యవంతుడేకాక, చిన్న తనంలో నా క్లాస్‌మేట్ కూడా! ఎనీ హౌ 'ఐ విష్ యూ ఆల్ ది బెస్ట్!'

ఎప్పుడైనా 'మన'— సారీ! మా వూరొస్తే, మీకు నా హృదయపూర్వక స్వాగతం. మీ కోసం మీ రాక, కోసం ఎదురుచూసే నువ్వు ప్రేమించని ...
నీ ప్రేమికుడు

— శ్రీధర్.